ప్రజాశక్తి
శనివారం 23 డిసెంబర్ 2023
5
విజయనగరం

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని యాడిక గ్రామానికి చెందిన రెల్లి సూరినాయుడు(55) శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. బుదరాయవలస హెడ్ కానిస్టేబుల్ సి.అంజిబాబు తెలిపిన వివరాలు ప్రకారం.. రెల్లి సూరినాయుడు తన పొలంలో వేసిన జొన్న చేను పంటకు నీరు కట్టేందుకు మోటార్ స్విచ్ ఆన్ చేశాడు. వెంటనే షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఆయన భార్య తవిటమ్మ స్థానికుల సాయంతో చీపురుపల్లి సిహెచ్‌సి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ, ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్‌కు నిరసనగా

ఇండియా కూటమి పార్టీల రాస్తారోకో

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

పార్లమెంటు ఉభయసభల్లో 141 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు జంక్షన్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షులు కె.దయానంద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎస్.రమేష్ మాట్లాడారు. బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం మరుగున పడిందని, బిజెపి ప్రభుత్వం రామరాజ్యం పేరు చెబుతూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌లో బిజెపి ఎంపి ప్రోత్సాహంతో ఇద్దరు యువకులు స్మోక్ కలర్ ఘటనకు పూనుకున్నారని, ఈ ఘటనపై అమిత్ షా ప్రకటన చేయాలని ప్రతిపక్ష ఎంపీలు ప్రశ్నిస్తే 141 మందిని సస్పెండ్‌చేయడం సిగ్గు చేటని అన్నారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య యుతంగా నిర్వహించ కుండా మోడీ స్వామ్యంతోనే నడిపిస్తున్నారని తెలిపారు. పార్లమెంట్ లోనే భద్రత లేకపోతే దేశానికి ఏం భద్రత ఉంటుందని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం ఇదే రకమైనటువంటి వైఖరితో కొనసాగితే దేశానికి ముప్పని అన్నారు. దేశం యావత్తు దీనిని ఖండించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శంకర్రావు, జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, సిపిఐ నాయకులు బి.అశోక్, రంగరాజు, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డోల శ్రీనివాస్, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షరీఫ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ప్రతిపక్ష ఎంపిలను బహిష్కరించడం దుర్మార్గమని వామ పక్ష నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు అన్నారు. ఎంపిల బహిష్కరణకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక మొయిద జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార బిజెపి ప్రతిపక్ష నేతల గొంతు నొక్కడానికిఎంపిలను బహిష్కరించడం దుర్మార్గమని అన్నారు.

రాస్తారోకో చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

అంగన్‌వాడీల ఆగ్రహం

పలుచోట్ల రాస్తారోకోలు ●సమస్యలు పరిష్కరించకుంటే పతనం ఖాయం : యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

రామభద్రపురం : మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు శుక్రవారం కదం తొక్కారు. 11రోజులైనా ప్రభుత్వం స్పందించక పోవడంతో రహదారులపై బైఠాయించారు. స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి అంగన్‌వాడీలపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కలెక్టరేట్ నుంచి బొబ్బిలి వైపు వెళ్లే జాతీయ రహదారిపై యూత్ హాస్టల్ ఎదురుగా బైఠాయించారు. తమ సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని నినాదాలు చేశారు. అరగంట పాటు చేసిన రాస్తారోకోతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. సమస్యల పరిష్కరించేవరకు తమ పోరాటం ఆగదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూపడం సరికాదన్నారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాస్తారోకో విరమించి కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షను సాయంత్రం వరకు కొనసాగించారు. అంగన్వాడీల పోరాటానికి మద్దతు తెలుపుతూ యుటి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం మొండి వైఖరి వీడకుంటే తగిన గుణపాఠం తప్పదని తెలిపారు. వారేమీ ఒంటరి వారు కాదని, వారికి అన్ని వర్గాల ప్రజలు సహకారం, మద్దతు ఉందన్నారు. మద్దతు తెలిపిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు ఎ.జగన్మోహన్, బి.సుధారాణి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. అంగన్వాడీల సమ్మె కు ఎఐఎఫ్‌టియు నాయకులు బెహరా శంకర్రావు మద్దతు తెలిపారు.

విజయనగరం : కలెక్టరేట్ సమీపాన రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బొబ్బిలి : పట్టణంలోని జెండమాల్ జంక్షన్ లో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, ఉమాగౌరి, అనురాధ, బి.నిర్మల, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : స్థానిక నాలుగురోడ్ల జంక్షన్‌లో అంగన్‌వాడీలు రాస్తారోకో చేశారు. స్త్రీశిశు సంక్షేమశాఖా మంత్రి అంగన్‌వాడీలపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మెను విరమించేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుభాషిని, పి.జ్యోతి, డి.నాగమణి, నారాయణమ్మ, రాములమ్మ, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జామి : తహశీల్దార్ కార్యాలయం నుంచి నిరసన ర్యాలీగా వెళ్లి, బస్టాండ్ జంక్షన్లో మానవహారం చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల డిమాండ్లు నెరవేర్చాలని, లేకపోతే ఉద్యమం తీవ్రమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కనక మహాలక్ష్మి, వరలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కొత్తవలస : అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస : కొత్తవలస జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సెంటర్లను మూసివేసి నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్ వాడీలపై బెదిరింపుల మానుకొని ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు కాకర తులసి, రెడ్డి శంకరావతి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బాడంగి : అంగన్‌వాడీలంతా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు..

రామభద్రపురం : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న శిబిరంలో మెడకు ఉరితాళ్లు వేసుకొని అంగన్‌వాడీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వీరికి సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నేతలు రాదమ్మ, చిన్నమ్మలు, గౌరి,సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. **రాజాం :** పట్టణంలో అంగన్‌వాడీలంతా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు మాట్లాడారు. యూనియన్ నాయకులు ఉమా కుమారి ,సునీత ,భారతి ,చిన్నమ్మడు, జయలక్ష్మి, కాళీ రత్నం, పద్మ, పార్వతి ,లక్ష్మీనారాయణ ,వనజ ,ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ మద్దతు తెలిపారు. హామీ ఇచ్చినప్పుడు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శి కర్రోతు రాజు పాల్గొన్నారు. అంతకుముందు సిఐటియు జిల్లా కార్యదర్శి బి. సూర్య నారాయణ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. యూనియన్ నాయకులు క్రిష్ణవేణి, కొర్లమ్మ, అనిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ర్యాలీ, రాస్తారోకో

మాట నిలబెట్టుకోకుంటే కుర్చీలు కదిలిస్తాం : యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు మరిచి సమగ్ర శిక్ష ఉద్యోగులను మోసం చేశారని, హామీలు అమలు చేయకపోతే చంద్ర బాబుకి గత ఎన్నికల్లో పట్టిన గతే జగన్ కు తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆర్అండ్‌బి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి ప్రతి నెలా 1వ తేదీకి వేతనాలు చెల్లించాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, గ్రాడ్యుటీ మరియు 20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, నాయకులు తిరుపతి నాయుడు మద్దతు తెలిపారు. న్యాయమైన తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె విరమించబోమని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు స్పష్టం చేశారు.

రాస్తారోకోను ఉద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

సమన్వయంతో 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరి సమన్వయంతో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని సెట్విజ్ సిఇఒ బి.రామ్ గోపాల్ తెలిపారు. స్థానిక రాజీవ్ స్టేడియంలో ఆడదాం ఆంధ్రా పోటీల నిర్వహణకు చేపట్టాల్సిన కార్యాచరణ పై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, కాళ్ళ సూరిబాబు, కార్పొరేటర్ తవిటి రాజు, చీఫ్ కోచ్ అచ్యుత కుమార్, సెట్విజ్ సిఇఒ బి.రామ్ గోపాల్, వివిధ మండలాల కోచ్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి క్రీడాంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

26 వరకు 'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్లు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు రిజిస్ట్రేషన్లు చేసుకొనేందుకు ఈ నెల 26వరకు అవకాశం కల్పించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. క్రీడాపోటీల సన్నద్ధతపై వివిధ శాఖల అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, పిఇటిలు, ఎంపిఒలు, మండల, నియోజకవర్గ సమన్వయకర్తలతో శుక్రవారం జాయింట్ కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, జిల్లాలో క్రీడా పోటీలకు మొత్తం 626 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు సుమారు లక్షా, 13 వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. కొన్ని మండలాల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య తక్కువగా ఉందని, దానిని పెంచాలని కోరారు. ఆసక్తి ఉన్నవారికి ఈనెల 26 వరకు అవకాశం ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు చేసుకున్న క్రీడాకారుల చేత శనివారం జట్లను రూపొందించాలని ఆదేశించారు. దీనికోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌ను ప్రతీఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకొని, రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 24వ తేదీ నుంచి మ్యాచ్ షెడ్యూల్‌ను రూపొందించి, జాబితాలను ప్రదర్శించాలన్నారు. 24,25 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి క్రీడల్లో పాల్గొనేవారికి, ప్రేక్షకులకు తెలియజేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి ఒక్కో జట్టును ఎంపిక చేసి, మండల స్థాయి పోటీలకు పంపించాలన్నారు. మండల స్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకు టి-షర్టులు, టోపీలను ఇస్తామని చెప్పారు. ఈనెల 23వ తేదీన ప్రతీ మండలంలో ఎంపిడిఒలు, ప్రత్యేకాధికారులు సమావేశాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈనెల 26 నుంచి జనవరి 9 వరకు గ్రామ స్థాయిలో, 10 నుంచి 23 వరకు మండల స్థాయిలో, 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో, 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయని జెసి తెలిపారు.

ఒక శాతం సెస్ ను జమ చేయాలి

ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో జరిగే నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లుల్లో ఒక శాతం సెస్‌ను ప్రతి నెలా నిర్మాణ మండలికి అందజేయాలని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. శుక్రవారం భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం 1996 పై సమీక్ష నిర్వహించారు. జెసి మాట్లాడుతూ పలు నిర్మాణ పనులు చేపట్టే ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం కింద ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ భవన, ఇతర నిర్మాణాల మీద వచ్చే ఆదాయంలో ఒక శాతం సెస్‌ను మండలికి జమ చేయాలన్నారు. ఒక శాతం సెస్ మండలికి సక్రమంగా జమ చేస్తున్నారా లేదా నివేదికలు పంపుతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. సమావేశంలో కార్మికశాఖ ఉప కమిషనర్ ప్రసాదరావు, పరిశ్రమల శాఖ జిఎం పాపారావు, డిపిఒ, ఆర్ అండ్‌బి ఇఇలు, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

20 అంశాల ఎజెండాకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపర్చిన 20 అంశాలను స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదించారు. టెండర్ల ప్రక్రియ ఖరారైన వెంటనే పనులు పూర్తి చేసే విధంగా చొరవ చూపాలని మేయరు విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ అన్నారు. సమావేశంలో కమిషనర్ ఆర్ శ్రీ రాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు

జనసేన నాయకులు గురాన అయ్యలు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి కనువిప్పు కలిగేలా యువగళం నవశకం విజయోత్సవ సభ విజయవంతం అయ్యిందని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయ్యలు మాట్లాడుతూ టిడిపి-జనసేన కూటమికి అధికారం ఇచ్చేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. వైసిపి పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని చెప్పడానికి పోలిపల్లి సభ విజయవంతం కావడమే నిదర్శనమన్నారు. ప్రజలు కట్టిన పన్నుల సొమ్ముతో నగరంలో సుందరీకరణ పేరుతో జిమ్మిక్కులు చేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల.. గ్రామాల్లో ఎందుకు అభివృద్ధి పనులు గురించి మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నగర పరిధిలోని తోటపాలెం వైఎస్ఆర్ కాలనీ, కొండకరకాం వద్దగల వైఎస్ఆర్ నగర్‌లో కనీస మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించడం లేదో చెప్పాలన్నారు.

ధాన్యం కొనుగోలులో బరితెగింపు

- ఎప్పటిలాగే అదనపు కేజీలు డిమాండ్
- క్వింటాకు 7 కిలోలు దోపిడి
- వే బ్రిడ్జి, కలాసీ ఛార్జీల పేరిట మరో రూ. 200
- దిక్కున్నవారికి చెప్పుకోవాలని బెదిరింపులు

ప్రజాశక్తి- జామి

ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో మిల్లర్లు బరితెగిస్తున్నారు. నిన్నటి వరకు ఉన్నతాధికారులకు తెలిస్తే, ఇబ్బంది అని భావించిన మిల్లర్లు ఈ సారి ఎవరికి చెప్పుకున్నా భయం లేదని బాహాటంగానే చెబుతున్నారు. 'గత ఏడాది మిల్లర్లు ఆగడాలు అరికట్టే విధంగా రైతులకు, మిల్లర్లుకు సంబంధం లేకుండా చేసి, పండించిన ప్రతి ఒక్క ధాన్యపు గింజనూ కొంటామని, రైతులు మిల్లర్లకు అదనంగా ఒక్క కేజీ కూడా ఇవ్వాల్సిన పని లేదని ప్రభుత్వ పెద్దలతో పాటు అధికారులు చెప్పినా, చివరికి మిల్లర్లకు దాసోహం అయ్యారు. కానీ ఈసారి ధాన్యం కొనుగోలు ప్రారంభం నుంచే దోపిడీ మొదలెట్టారు.

జిల్లాలో గతేడాది 3.37 లక్షల ఎకరాల్లో రైతులు వరిని పండించారు. ఈ ఏడాది జిల్లాలో 2.40లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇటీవల తుపానుకు వేలాది ఎకరాల్లో పంట నష్టపోయింది. రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా కేంద్రాలు తెరుచుకున్నాయి. ఈ సారి రైతులకు మాత్రం మిల్లర్లు బెడద ఎక్కువైంది. ఆదిలోనే మిల్లర్లు రైతుల నుంచి అదనపు కేజీలు బాహాటంగా వసూలు చేస్తున్నారు. ధాన్యం దించుకోవాలంటే క్వింటాకు 7 నుంచి 10 కేజీలు అదనపు ధాన్యం చెల్లించాల్సిందే అంటూ లేదంటే కొనుగోలు కుదరదని ఖరాఖండిగా చెబుతున్న పరిస్థితి. గతంలో ఆర్‌బికెల్లో ట్రక్కు షీట్ కొట్టడం పూర్తయ్యిందనీ అప్పట్లో అదనపు ధాన్యానికి బదులు డబ్బులు ముక్కుపిండి వసూలు చేశారు. ఈ సారి ధాన్యం ఇవ్వడంతో పాటు క్వింటాకు రూ.200 చొప్పున సొమ్ము వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు చెప్పుకున్నా పర్వాలేదు...ఈ విషయం అందరికీ తెలిసిందే అంటూ వెటకారంగా చెబుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అదనపు వసూళ్లపై జెసికి ఫిర్యాదు చేస్తామన్నా మిల్లర్లు వెనుకడుగు వేయడం లేదని చెబుతున్నారు. ఇక మండల స్థాయి అధికారులు, కస్టోడియన్ అధికారులు సంగతి వేరే చెప్పాల్సిన పని లేదు.

మిల్లర్లు దందా పై కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తాం

రైతుల నుంచి మిల్లర్లు అధనపు ధాన్యాన్ని బాహాటంగానే వసూలు చేస్తున్నాయి. మిల్లర్ల అసోసియేషన్ పేరుతో నిర్ణయించామని, ఎవరికి చెప్పుకున్నా పర్వాలేదని కొంత మంది రైతులతో చెబుతున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు ధాన్యం కొనుగోలుపై చర్యలు తీసుకుని దోపిడీ అరికట్టే విధంగా అదేశాలు జారీ చేయాలి. లేని యెడల రైతులను సమీకరించి, మిల్లర్ల దోపిడీ పై తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తాం. దీనికి ముందు మిల్లర్లు దోపిడీపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- బుద్ధరాజు రాంబాబు,
జిల్లా రైతు సంఘం నాయకులు

ఎన్నికల్లో తడాఖా చూపిస్తాం

మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రానున్న పంచాయతీ ఎన్నికల్లో పంచాయతీలు అంటే ఏమిటో తడాఖా చూపిస్తామని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామాల పరిస్థితి దుర్భరంగా ఆవేదన వ్యక్తం చేశారు, గుక్కెడు నీళ్ల తాగడానికి నిధులు లేవని,పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయిందని, దీనికి కారణం ముఖ్యమంత్రేనని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన 14, 15 సంవత్సర ఆర్థిక సంఘం నిధులను సొంత అవసరాలకు వాడుకున్నారని తెలిపారు. గత నాలుగేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 8629 కోట్ల రూపాయలను జగన్ దిగమింగారన్నారు. రాష్ట్రంలో 12918 మంది సర్పంచుల్లో 90 శాతం సర్పంచులు వైసిపి నాయకులు ఉన్నారన్నారు, పాము తన పిల్లలను తానే తింటున్న మాదిరిగా ముఖ్యమంత్రి తమ సర్పంచ్‌ల నిధులను మింగుతున్నారని తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి గ్రామాల్లో సభలు పెట్టి ఎందుకు ప్రజలకు సేవ చేయలేక పోతున్నామో వివరిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగంలో ఉన్న 73 ,74 రాజ్యాంగ చట్టాలకు జగన్మోహన్ రెడ్డి తూట్లు పొడుస్తున్నారన్నారు. సచివాలయాలను గ్రామపంచాయతీల్లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ద్వారా ఎన్నికైన తాము ప్రజలు ప్రశ్నిస్తుంటే పిల్లల్లా దాక్కోవలసి వస్తుందని అన్నారు. విజయనగరం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కె.సత్యం, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి గేదెల రాజారావు, ఉపాధ్యక్షులు రామకృష్ణబాబు, వినోద్ రాజు, ఎస్.కోట నియోజకవర్గం పంచాయతీ రాజ్ అధ్యక్షులు డేగల ఈశ్వరరావు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

సొంత ఖర్చులతో బోరు ఏర్పాటు

డెంకాడ: మండలంలోని అమకాం గ్రామంలో తన సొంత ఖర్చులతో తాగునీరు బోరును జనసేన నియోజకవర్గం ఇంఛార్జి లోకం మాధవి ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన పనులను శుక్రవారం గ్రామంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గ్రామంలో అధికంగా తాగునీటి ఇబ్బంది ఉన్నట్లు తన దృష్టికి రావడంతో వెంటనే స్పందించి బోరు నిధులు వెచ్చించి బోరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే వైసిపి నాయకుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని గ్రామస్తులు తన ముందు వాపోవడంతో వెంటనే రూ.లక్ష వెచ్చించి బోరు వేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మిరాజ్, సీనియర్ నాయకులు తొట్టడి సూర్యప్రకాష్, గుడివాడ జమ్మి రాజు, గుడివాడ శేఖర్, కోరాడ అప్పారావు, అట్టాడ ప్రమీల, కోన శివ, పంట్రంకి మహేష్, పిల్లా నాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

గజపతినగరం: లైన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆవరణలో శుక్రవారం గజపతినగరం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 210 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ బివిఎస్ఆర్ మూర్తి, డాక్టర్ నాగ నరేంద్ర జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ ఉచిత కంటి పరీక్షల శిబిరంలో ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ టెక్నీషియన్ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, లైన్స్ హై స్కూల్కు చెందిన విద్యార్థులకు పరీక్షల అనంతరం 18 మంది విద్యార్థులను స్థానిక శ్రీనివాస నర్సింగ్ హోమ్కి రిఫర్ చేశారు. ముందుగా ఈ శిబిరాన్ని ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గజపతినగరం లైన్స్ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిస్వార్థంగా చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ పీబీ కుమార్, పీడీ జిలయన్, బెల్లాన లక్ష్మీనరేన్, లయన్ డాక్టర్ రెడ్డి పావని, లయన్ బెల్లాన త్రినాద్, లయన్ కరణం ఆదినారాయణ, గేదెల జగదీష్, టిఆఎస్ బంగారు రాజు, పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన

బొబ్బిలి: స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం పరీక్షలు సన్నద్ధతపై అవగాహన కల్పించారు. జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ బోణి రామానందం ఏ విధంగా చదివితే ఎక్కువ మార్కులు సాధించవచ్చునో విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆలెన్ వన్ బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులందరూ 100శాతం పాస్ అవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎస్డబ్ల్యు. డివి సత్యనారాయణ రామభద్రపురం,పెరుమాలి,తెర్లాం వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

వేపాడ: మండలంలోని సింగరాయ గ్రామానికి చెందిన చొప్ప అవతారం అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన నేపథ్యంలో ఆయన భార్య లక్ష్మికి వైఎస్ఆర్ బీమా పథకం నుండి రూ.5వేలు మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును సర్పంచ్ ఎన్ వెంకటరావు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో ఉద్యోగుల గ్రీవెన్స్

నెల్లిమర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించి ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. నగర పంచాయతీలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్కు ఎంపిక

కొత్తవలస: మండలంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి లో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఒపి జిందాల్ భారతి విద్యా మందిర్ స్కూల్లో నిర్వహించినట్లు శుక్రవారం జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ ఎల్. సత్యారావు తెలిపారు. దేవాడ అమరావతి స్కూల్, వియ్యంపేట డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం, జిల్లా పరిషత్, కెజిబివి, కంటకాపల్లి జెడిపి, జిందాల్ నగర్ ఒపి జిందాల్ స్కూల్ విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్ కు హాజరయ్యారన్నారు. ఇందులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్కు ఎంపికయ్యారన్నారు. జిందాల్ ప్రిన్సిపాల్ చక్రవర్తి, సైన్స్ టీచర్ వినోద్, ఉపాధ్యాయులు చేతుల మీదుగా జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికేట్, బహుమతులు అందజేసి అభినందించారు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర' పక్కాగా నిర్వహించాలి

రేగిడి: ఆడదాం ఆంధ్ర క్రీడలను సచివాలయ పరిధిలో పక్కాగా నిర్వహించాలని ఎంపిడిఒ శ్యామలాకుమారి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి పీడీలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ పరిధి గ్రామాల్లో ఆడదాం ఆంధ్ర క్రీడల్లో పాల్గొనే వారి పేర్లు నమోదు చేయాలని సూచించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ తదితర క్రీడలకు 15 ఏళ్లు దాటినవారు దరఖాస్తు చేసుకుంటే ఈనెల 26న క్రీడలు చేపడతామన్నారు. దరఖాస్తుల ప్రాప్తికి రెండు రోజులు ముందే పీడీలు, పీఈటీలు క్రీడాకారుల ఎంపిక నివేదికలు తయారు చేయాలన్నారు. ఆటలాడేందుకు ఆట స్థలాలు అనువుగా ఉంచాలన్నారు. విద్యార్థులకు క్రీడల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మండల స్పోర్ట్స్ కన్వీనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఉపాధి పనులు

రేగిడి: ప్రణాళిక బద్ధంగా ఉపాధి పనులు నిర్వహించాలని వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహన్ రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో మేట్లతో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబు కార్డు ఉన్న వారందరికీ ప్రణాళిక ప్రకారం పనులు చేయిస్తే రోజువారి వేతనం రూ.272 వచ్చే విధంగా ఉంటాయన్నారు. కొలతలు ప్రకారం పనులు చేయిస్తే కూలి గిట్టుబాటు అవుతుందని తెలిపారు. ప్రతీ మేట్ ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్లు చేయించాలన్నారు. వీరితోపాటు వీసీ రామానాయుడు, వియ్యపు చక్రపాణి పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో జై కిసాన్- జై భారత్

విజయనగరం : శ్రీ చైతన్య విద్యా సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా నిర్వహించే వివిధ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం 'జైకిసాన్-జై భారత్'అను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులను రైతు వేషధారణలతో అలరించారు. దేశానికి వెన్నెముక అయిన రైతులను గురించి విద్యార్థులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వి.శ్రీనివాసరావు వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతుల పాత్ర, భారతదేశం యొక్క గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం టౌన్: రూ.కోటి 27లక్షలతో నిర్మించనున్న కాలువలకు, కల్వర్టులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపన చేశారు. ఫ్లోర్ లీడర్ ఎస్వీవి రాజేష్, స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, తోనంగి జగన్నాథ రెడ్డి తదితరులతో కలిసి నాలుగు ప్రాంతాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక 31వ డివిజన్ వసంత విహార్ వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. జోనల్ ఇన్చార్జిలు కోలగట్ల కష్ణారావు, బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను ఆదరించాలి

విజయనగరం టౌన్: డ్వాక్రా వస్తువులను, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఆదరించాల్సిన అవసరం ఉందని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా అర్బన్ మెప్మా మార్టును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాళ్ళలో ఏర్పాటుచేసిన వివిధ వస్తువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ గొప్పలకు రూ.500 కోట్లు ఖర్చు

ప్రజాశక్తి- వేపాడ

గొంప కృష్ణ

జగన్మోహన్‌రెడ్డి చేతగాని తనాన్ని గొప్పలుగా చెప్పుకోవడానికి సాక్షి పత్రికలో రూ.500 కోట్లు ఖర్చు పెట్టి యాడ్‌లు వేసుకున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతానని చెప్పి నాలుగేళ్లలో అంచలంచెలుగా 250 రూపాయలు చొప్పున పెంచుకుంటూ వచ్చారన్నారు. 2024 ఎన్నికలు సమీపిస్తుండటంతో తాను రూ.3వేలు పింఛను చేశానని గొప్పలు చెప్పుకోవడానికి తన సొంత పత్రికలో డబ్బా కొట్టుకుంటున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల కాలంలో దాచుకోవడం దోచుకోవడం తప్ప బడుగు బలహీన వర్గాల బాగోగులు గూర్చి ఇంతవరకు ఏఏ పథకాలు అమలు చేశారో చెప్పాలన్నారు. దౌర్జన్యాలు, దోపిడీలు, రాష్ట్ర వ్యాప్తంగా తేటతెల్లమయ్యాయన్నారు. ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తక్కువ ఖర్చుతో బోధనాభ్యాస పరికరాలు తయారు చేసి చూపించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలు కొనియాడారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు. మాణిక్యం నాయుడు, అధ్యాపకులు కె. రామకృష్ణా రావు, జివిఎస్ఎస్ నాగేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ డి. ఈశ్వర రావు, గణిత శాస్త్ర అధ్యాపకులు కె. సూర్యారావు, వివిజెఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పిటిసి పెద్దింటి రామారావు హాజరై శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గణిత ప్రాజెక్టులను పరిశీలించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యనారాయణ, గణిత ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: డైట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

రామభద్రపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముగ్గుల్లో గణితం అనే అంశం పైన ముగ్గులు పోటీలు, గణితం పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ మురళీధర్, ఉపాధ్యాయులు దాలినాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని భవానినగర్‌లో గల గౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శుక్రవారం ఘనంగా గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎం సుబ్బరాజు విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు గురించి వివరించారు. గణితంపై ప్రతిభా పరీక్ష, క్విజ్ పోటీలు ప్రాజెక్ట్ ప్రదర్శన నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాండ్రేగుల వెంకట రాము, కరస్పాండెంట్ కాండ్రేగుల సన్యాసినాయుడు, గణిత ఉపాధ్యాయులు బి. గణేష్, బి. నరేష్, పి. గాంధీబాబు తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించిన తహశీల్దార్ డి. ఐజాక్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి గణితంలో నిర్వహించిన పలు పోటీలలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం గణిత ఉపాధ్యాయులు బి.ఈశ్వరరావు, ఎం.వెంకటపతి, వై. హరిబాబులకు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో సన్మానం చేశారు.

వంగర: బహుమతులు ప్రదానం చేస్తున్న తహశీల్దార్

లక్కవరపుకోట: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్, మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాల, ఎపి మోడల్ స్కూల్ తదితర పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. విద్యార్థులు వేసిన ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద, శ్రీ చైతన్య, జ్యోతిరావుపూలే, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎస్వీ రమణ, పాత్రో పాల్గొన్నారు.

విజయనగరం కోట: ప్రపంచ మేధావి శ్రీనివాస్ రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా పలుచోట్ల శుక్రవారం మ్యాథ్స్‌డే వేడుకలు జరిగాయి. గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ 136వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు ఉపాధ్యాయులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ఆయన పరిశోధన సంఖ్య 1729ను పలకలపై రాసి విద్యార్థులతో ప్రదర్శించారు. కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గొప్ప గణిత మేధావి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్‌కోట: ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేపాడ: నెంబరు ఆకారంలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

నారాయణ స్కూల్లో ఘనంగా మాథ్స్ డే

విజయనగరం టౌన్ : శ్రీనివాస రామానుజం పుట్టినరోజు సందర్భంగా స్థానిక రింగురోడ్డు వద్ద గల నారాయణ పాఠశాల లో శుక్రవారం 'మాథ్స్ డే నిర్వహించారు. హెచ్ఎం ప్రభావతి దేవి, ఆర్ఐ రాజేష్ , హైస్కూల్ కో.ఆర్డినేటర్ వెంకట్ మంట్లాడుతూ గణితం గొప్పతనాన్ని వివరించారు.

బొబ్బిలి: పట్టణంలోని గణిత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత పితామహుడు శ్రీనివాస్ రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థానం పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు ఎన్‌విఆర్ సత్యనారాయణ మూర్తిను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక , జెడ్‌పిటిసి గార తౌడు చేతుల మీదుగా బైజూస్ కంటెంట్ తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, .ప్రభుత్వం ఎంతో వ్యయంతో బై జ్యూస్ కంటెంట్ కూడిన ఈ ట్యాబ్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయ న్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సాయి చక్రధర్, ప్రధానోపాధ్యాయులు చిప్పాడ రమేష్ కుమార్, మీసాల వెంకటేశ్వరరావు ,నాగమణి, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచ్ ఎస్.విజయలక్ష్మి, బెల్లాన త్రినాధ రావు,ఉప సర్పంచ్ మండల సురేష్ ,రేగ సురేష్, ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్ సిహెచ్ సోమావతి, కడగల రామచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాడంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు స్థానిక జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు చేతుల మీదుగా బైజ్యూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం ఏటా ట్యాబ్‌లు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు లక్ష్మణదొర, రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయులు సత్య నారాయణ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గజపతినగరం: ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 22 మంది 8వ తరగతి విద్యార్థులకు సర్పంచ్ మురిపిండి గంగరాజు చేతుల మీదుగా శుక్రవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలో గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్‌కు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన గణిత నమూనాల ప్రదర్శన, గణిత రంగవల్లి లఘు నాటికలు, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ అధ్యక్షులు ఎల్ నూకరత్నం, గణిత శాస్త్రం ఉపాధ్యక్షులు రవి శంకర్, పి రమేష్ నాయుడు పాల్గొన్నారు. బికే నాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు శుక్రవారం జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి సన్యాసిరావు, వైసిపి నాయకులు గండి శ్రీరామ్మూర్తి, ఆదర్శ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపికి షాక్

పార్టీని వీడిన సర్పంచ్, 300 కుటుంబాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

నియోజకవర్గంలోని రామభద్రపురం మండలంలోని అధికార వైసిపికి భారీ షాక్ తగిలింది. సోంపురం పంచాయతీ వైసిపి సర్పంచ్ చొక్కాపు చినఅప్పలనాయుడు శుక్రవారం బొబ్బిలి కోటలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. సోంపురం, మర్రివలస, చింతలవలస గ్రామాలకు చెందిన మరో 300 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు విసుగు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు టిడిపి వైపు చూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రామభద్రపురం మండల అద్యక్షులు కరణం భాస్కరరావు, సీనియర్ నాయకులు ఎం.తిరుపతిరావు, టిడిపి పట్టణ అద్యక్షులు రాంబార్కి శరత్ తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా రబీసాగు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో రబీసాగు మందకొడిగా సాగుతోంది. ఖరీఫ్‌లో ఏర్పడిన నీటిఎద్దడే ఇందుకు కారణమని అటు రైతులు, ఇటు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో వరి, మొక్కజొన్న, రాగులు, పెసలు, మినుములు తదితర పంటల సాధారణ విస్తీర్ణం 1,72,710 ఎకరాలు. ఇందులో ప్రధానంగా ముఖ్యంగా సాగునీటి సదుపాయం ఉన్నచోట 75వేల ఎకరాల్లో వరి, 50వేల ఎకరాల్లో మొక్కజొన్న, 15వేల ఎకరాల్లో చెరకు, 5వేల ఎకరాల్లో రాగులు, 5వేల ఎకరాల్లో నువ్వులు సాగుకావాల్సివుంది. ఇంకా అనేక పంటలు సాగు కావాల్సివుంది. కానీ, ఇప్పటి వరకు అన్నిరకాల పంటలు కలుపుకుని కేవలం 37,925 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. వరి నాట్లు ఒక్క ఎకరాలనూ పడలేదు. మొక్కజొన్న 10వేల ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది. మిగిలిన పంటల సాగు తీరు కూడా తక్కువగానే ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 48,182 ఎకరాల్లో పంటల సాగు పూర్తైనట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నారు. సుమారు 2వేల ఎకరాల వ్యత్యాసం కనిపిస్తోంది. గత ఏడాది 1,58,687 సాగు విస్తీర్ణం నమోదైంది. ఈ సమయానికి వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క ఎకరాలోనూ నాట్లు పడలేదు.

ఒక్క ఎకరాలోనూ పడని వరినాట్లు

నాట్లు పడని భూములు

వాస్తవానికి అక్టోబర్ నుంచే జిల్లాలో రబీ సీజన్ మొదలవుతుంది. కోత దశలోవున్న వరిలోనే మినుములు, పెసలు తదితర అపరాలు అంతరపంటలుగా వేస్తారు. కోత పూర్తికాగానే రాగులు, జొన్నలు తదితర పంటలు వేస్తారు. సీజన్ ప్రారంభంలో తీవ్ర నీటి ఎద్దడికి తోడు మండుతున్న ఎండల వల్ల పంటల సాగు ప్రారంభానికి నోచుకోలేదు. తీరా నవంబర్‌లో కాస్త వర్షాలు పడి సాగుకు సిద్ధమయ్యే సమయానికి మిచౌంగ్ పేరిట వచ్చిన తుపాను అతి వృష్టితో ఇబ్బందులకు గురిచేసింది. ఈనేపథ్యంలో జిల్లాలో రబీ పంటల సాగు మందకొడిగా సాగుతోంది. మరోవైపు తుపాను కారణంగానూ, తొలిదశలో నీటి ఎద్దడి కారణంగానూ పంటలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. తాజాగా రబీ పంటల సాగు తగ్గిపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

లెండీలో 5జి సాంకేతికతపై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం 5జి సాంకేతికతపై అవగాహన సదస్సు నిర్వహించారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా విజయనగరంలో టెలికాం వినియోగదారులకు వారి హక్కులు, అధికారాల గురించి లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీతో సమన్వయంతో అవగాహన కల్పించేందుకు టెలికాం వినియోగదారుల ఔట్రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. న్యూఢిల్లీ ట్రాయ్ బిబి అండ్ పిపి సలహాదారు సంజీవ్ కుమార్ శర్మ 5జీ టెక్నాలజీ పాత్ర గురించి క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు సమకూర్చుకొని తమ లక్ష్యాల సాధనకు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. 6జి టెక్నాలజీపై ఇప్పటికే పరిశోధనలు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ టెలికమ్యూనికేషన్ సర్వీసెస్ ప్రతినిధి బి ప్రవీణ్‌కుమార్, లెండి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకట రామారెడ్డి, ఐటిఎస్ జాయింట్ అడ్వైజర్ రాజు, ఎపి డాట్ డైరెక్టర్ జివి మనోజ్ కుమార్, విజయనగరం సైబర్ క్రైమ్ సిఐ ఎం. ప్రశాంత్ కుమార్, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ ఎం వెంకటపతి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం. రాజన్ బాబు, అర్అండ్ డి డీన్ డాక్టర్ డి.నరేష్ కుమార్, డాక్టర్ ఎస్.శ్రీధర్, డాక్టర్ ఎవి పరంకుశం, డాక్టర్ బి.శ్రీధర్ ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్

అపెక్స్ హేచరీపై గ్రామస్తులతో చర్చలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చేపలకంచేరు పంచాయతీ దిబ్బలపాలెం గ్రామం వద్దనున్న అపెక్స్ రొయ్య పిల్లల హేచరీ తెరిపించేందుకు అధికారులు, యాజమాన్యం, గ్రామపెద్దలతో కలిసి శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. సుమారు రెండున్నరేళ్ల కిందట గ్రామస్తులకు, ఈ కంపెనీ మధ్య వివాదం నెలకొంది. దీంతో అప్పటి నుంచి ఈ హేచరీని మూసివేశారు. అప్పట్లో ఈ హేచరీకి సంబంధించిన వృధా నీరు రైతుల జిరాయితీ పొలాలు మీదుగా పైపుల ద్వారా సముద్రంలోకి విడిచిపెట్టేవారు. దీంతో వివాదం మొదలై చివరకు రైతులు తమ పొలాల్లో నుంచి వెళ్తున్న పైపులైన్లు ధ్వంసం చేశారు. దీంతో కంపెనీ యాజమాన్యం కొంతమందిపై కేసులు నమోదు చేసింది. అయితే ఇటీవలి హేచరీ యాజమాన్యం కంపెనీ తెరిపించేందుకు సహకరించాలని కలెక్టరును ఆశ్రయించారు. కలెక్టరు ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దారు బంగార్రాజు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రాజా, మత్స్యశాఖ అధికారి చాందిని ఇతర అధికారుల సమక్షంలో పెద్దలు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, గ్రామస్తులు దల్లి బంగారు రెడ్డి, ఎల్లారావు తదితరులు సమావేశం అయ్యారు. గ్రామస్తులు యాజమాన్యం మధ్యం చర్చలు జరిగాయి. గ్రామస్తులతో మరోసారి ఆలోచించి ఈ నెల 26వ తేదీన మరోమారు సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం హేచరీ ప్రారంభించాలని నిర్ణయించారు. చర్చల్లో ఇఒపిఆర్‌డి సురేష్ పాల్గొన్నారు.

అధికారులు, యజమాన్యంతో మాట్లాడుతున్న నాయకులు

బాధితులకు న్యాయం చేస్తాం: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కొత్తవలస

విశాఖపట్నం టు అరకు నేషనల్ హైవే రోడ్ 516 బాధితులకు సత్వర న్యాయం చేస్తామని విజయనగరం ఆర్‌డిఒ ఎం.వి సూర్యకుమారి తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో శుక్రవారం నేషనల్ హైవే రోడ్ బాధితులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ హైవేకి భూములు ఇచ్చిన వారికి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ విషయంలో భూమిలిచ్చిన వారు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. మండలంలో సుమారు 9 గ్రామాల ప్రజలు నేషనల్ హైవే నెంబర్ 516 బిలో భూములు కోల్పోతున్నారని వారి సమస్యలు పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ సభల్లో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. కొంతమంది ఇచ్చే నష్టపరిహారం పెంచమని, మరి కొంతమంది భూమి ఎక్కువగా కోల్పోతున్నామని, ఇంకొంతమంది సర్వేలో లోపాలు ఉన్నాయని ఆ సర్వే వల్ల గతంలో ఇచ్చిన దానికంటే ఎక్కువగా కోల్పోతున్నామని తెలిపినట్లు ఆర్‌డిఒ తెలిపారు. పూర్వం ఇచ్చిన డిపిఆర్‌నే అమలు చేయాలని కోరారని రైతులు కోరిన సమస్యలపై పై అధికారులకు నివేదికలు పంపించి రైతులకు మేలు జరిగే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తహశీ ల్దార్ శ్రీనివాస్‌మిశ్రా, రెవెన్యూ కార్యాలయ సిబ్బందితోపాటు 9 గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సూర్యకుమారి

పశువులకు ఆరోగ్య శ్రీ కార్డులు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని గర్భాం పశు వైద్యశాలను జాయింట్ డైరెక్టర్ ఏ. విశ్వేశ్వరరావు, డిడి వైవి రమణ ఆకస్మికంగా శుక్రవారం సందర్శించారు. పశువులకు అవసరమైన సేవలు అందుతున్నాయా బసెల్లస్ వాక్సినేషన ఎలా జరుగుతుంది, రైతులకు పశు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా లేదా? అని అక్కడ ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతి ఆరు పశువులకు ప్రభుత్వం ఒక హెల్త్ కార్డు ఇస్తుందన్నారు. ఆ కార్డులో ఆ రైతు పేరు, ఆపశువులకు ఏ రకమైన వైద్య సేవలు అందుతున్నాయి అనే వివరాలు పొందు పరుస్తారన్నారు. గొర్రెలు, మేకలు వున్నవారికి ప్రతి ఇరువై మేకలు, గొర్రెలకు ఒక హెల్త్ కార్డు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో పశువులకు 1.18లక్షల హెల్త్ కార్డులు పంపిణీ చేశామన్నారు. ఈ మండలంలో సుమారు ఐదువేల వరకు హెల్త్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. ముఖ్యంగా పశువులకు సంబంధించిన వ్యాధి బృసెల్లస్ వ్యాధి అని ఇది పశువులు నుండి మనుషులకు వ్యాపిస్తుందని, గొర్రెలకు వచ్చే పారుడు వ్యాధి ఒకటని వీటిని టీకాలు ద్వారా అరికట్ట వచ్చునని చెప్పారు. ప్రభుత్వం గడ్డి విత్తనాలను 75 శాతం సబ్సిడీతో ఆర్‌బికెలు ద్వారా రైతులకు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిడి వైవి రమణ, గర్భాం పశు వైద్యాధికారి హైమావతి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రామాల్లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నాబార్డ్ ఆర్థిక సహాయంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పూసపాటిరేగ ఎస్‌బిఐ మేనేజర్ జి. పైడిరాజు అన్నారు. మండలంలోని ఆరు గ్రామాలలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించి నట్లు తెలిపారు. రాజమహేంద్రవరానిక చెందిన కళాకారులు విభూతి బ్రదర్స్ వి. రఘురాం, చిరంజీ విచే కళాజాత నిర్వహిస్తున్నారన్నారు. ఖాతాదారులకు అర్థమయ్యే రీతిలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, పిఎం సురక్ష బీమా యోజన పథకం, అటల్ పింఛన్ స్వయం సిద్ధా రుణాల, పిఎం విశ్వకర్మ లోన్స్, ముద్ర, క్రాప్ లోన్స్ కోసం ఎస్‌బిఐ యోనో యొక్క వివరణ, గోల్డ్‌లోన్ పై వివరించారు. సిఎస్ పి కస్టమర్ సర్వీస్ పాయింట్ల వద్ద ప్రజలకు అర్థమయ్యే రీతిలో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఎవరు పడకుండా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత అవగాహనపై కళాజాత కార్యక్రమాలు మ్యాజిక్ షో ద్వారా ఆటలతో పాటలతో అర్థమయ్యే రీతిలో నిర్వర్తిస్తున్నారన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమం క్రింద ప్రతీనెలా గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు, వారి ఆరోగ్య పరిరక్షణకు టేక్ మోం రేషన్‌లో భాగంగా అందిస్తున్న పోషకాహార కిట్ల పంపిణీ జిల్లాలో శుక్రవారం ప్రారంభమయ్యింది. సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు పంపిణీని ప్రారంభించారు. తొలిరోజు 5,433 మంది గర్భిణులు, బాలింతలకు కిట్లను అందజేశారు.

జిల్లా వ్యాప్తంగా మొత్తం 1372 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 15,076 మంది గర్భిణులు, బాలింతలకు ఈ కిట్లను పంపిణీ చేయాల్సి ఉండగా, మొదటిరోజు 5,433 మందికి అందజేశారు. అవసరమైన కిట్లన్నీ ఇప్పటికే ఆయా మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుకున్నాయి. మిగిలిన వాటిని శనివారం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.